

బయో డైవర్సిటీ పార్క్ సందర్శన

జీచ్‌రోడ్డు: పీలానగర్‌కు చెందిన స్కూల్ విద్యార్థులు పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌ను గురువారం సందర్శించారు.



కేజీహెచ్‌లో యూఎస్ వైద్యుడు

మహారాణిపేట: యూఎస్ఏకు చెందిన వైద్య నిపుణుడు డాక్టర్ బ్రూస్ స్మిత్ కేజీహెచ్‌ను సందర్శించి పొన్సెటీ టెక్నిక్‌పై వివరించారు.



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి.

విశాఖకు తీవ్ర అన్యాయం

- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు ధర్మశ్రీ



అనకాపల్లి: విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ రావాలన్నది ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమని, ఇప్పుడు ఆ కల పూర్తి స్థాయిలో సాకారం కావడం లేదని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. విశాఖ కేంద్రంగా నూతనంగా ప్రకటించిన సౌత్ కోస్టల్ రైల్వేజోన్ పరిధి నిరాశాజనకంగా ఉందన్నారు. ఇది తల లేని మొండెంలా ఉందని, ఇంతకాలం వాల్తేరు డివిజన్‌లో ఉన్న కేకే లైన్‌ను రాయగడ కేంద్రంగా ఏర్పాటు చేయనున్న కొత్త డివిజన్లో చేర్చటం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. కేకే లైన్ విశాఖ రైల్వే జోన్ పరిధిలోనే ఉండాలన్నది ఉత్తరాంధ్రవాసుల చిరకాల వాంఛన్నారు. వాల్తేరు డివిజన్‌ను విచ్ఛిన్నం చేసి, ఒడిశాకు పెద్దపీట వేశారని ఆయన విమర్శించారు. సౌత్ కోస్ట్ రైల్వేజోన్‌కు అన్యాయం జరుగుతున్నా చంద్రబాబునాయుడు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. అనకాపల్లి, విశాఖ ఎంపీలు సీఎం రమేష్, భరత్ ఎందుకు నోరు మేదపడం లేదని ప్రశ్నించారు.

విశాఖ డివిజన్‌లోనే కేకే లైన్ కొనసాగించాలి

- కేంద్ర మంత్రి అశ్విని వైష్టవ్‌కు ఎంపీ తనూజరాణి వినతి



కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి

సాక్షి, పాడేరు : కేకే లైన్‌ను విశాఖ డివిజన్‌లోనే కొనసాగించాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి వినతి పత్రం అందజేశారు. పార్లమెంట్ భవన్‌లో కేంద్ర మంత్రిని ఎంపీ మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వివరించారు. విశాఖ పర్యాటక భూభాగంలో అరకులోయ ఉందని.. కేకే లైన్‌ను విశాఖ రైల్వే డివిజన్‌లో ఉంచడం వల్ల అరకులోయ, కిరండూల్ రైల్వే లైన్లు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని వివరించారు. తల్లిలాంటి వాల్తేరు డివిజన్ నుంచి కేకే లైన్‌ను వేరే చేయడం అంటే తల్లి నుంచి బిడ్డను వేరుచేయడమేనని వాపోయారు. రాయగడ డివిజన్‌లో కేకే లైన్‌ను విలీనం చేసే చర్యలను పునఃపరిశీలించాలని కేంద్ర మంత్రికి ఎంపీ విన్నవించారు. ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి చొరవతో అరకులోయలో రైల్వే రిక్వెస్టు స్టాప్ సమస్య పరిష్కారమైంది. కేంద్ర మంత్రికి ఈ సమస్య గురించి కూడా అరకు ఎంపీ సమగ్రంగా వివరించారు. దీంతో కేంద్ర మంత్రి సంబంధిత రైల్వే అధికారులతో మాట్లాడారు.

వాల్తేరు ఉండాల్సిందే..!

శతాబ్దాల చరిత్ర గల వాల్తేరు డివిజన్‌ను కాలగర్భంలో కలిపేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రపన్నుతోంది. పంచభక్ష్య పరమాన్నాలు పక్క రాష్ట్రానికి అప్పగించి.. ప్రసాదం చేతులో పెడుతుంటే ఆహా ఓహో అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నేతల వైఖరిపై విశాఖవాసులు మండిపడుతున్నారు. ఆదాయం వచ్చే మార్గాల్ని వాల్తేరు నుంచి వేరు చేస్తుంటే పట్టించుకోకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేకే లైన్‌తో కూడిన విశాఖ డివిజనే కావాలంటూ వివిధ ప్రజాసంఘాలు, రైల్వే యూనియన్‌లు డిమాండ్ చేస్తున్నాయి.



శతాబ్దానికి పైగా చరిత్ర ఉన్న డివిజన్ వదులుకోలేం..

కేకే లైన్‌తో కూడిన డివిజన్ ఉండాలని డిమాండ్

ఉద్యమ బాటలో వివిధ ప్రజాసంఘాలు, రైల్వే యూనియన్లు

డివిజన్ కొనసాగించాలని ఆది నుంచీ పట్టుబడుతున్న వైఎస్సార్‌సీపీ

2023-24లో వాల్తేరు డివిజన్ ఆదాయమిదీ..

నరకు హ్యాండ్లింగ్	నరకు రవాణా ఆదాయం
76.48 మిలియన్ టన్నులు	రూ. 9,222.77 కోట్లు

ప్రయాణికుల రాకపోకలు	ప్రయాణికుల రాకపోకల ద్వారా ఆదాయం
29.55 మిలియన్లు	రూ.788.29 కోట్లు

మొత్తం కోచింగ్ రెవెన్యూ	డివిజన్ వార్షికాదాయం
రూ.855.05 కోట్లు	రూ. 10,268.72 కోట్లు

సాక్షి, విశాఖపట్నం : వాల్తేరు డివిజన్.. తూర్పు కోస్తా రైల్వేకు ప్రధాన ఆదాయ వనరు. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా 2019 ఫిబ్రవరి 27న కేంద్ర ప్రభుత్వం విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. విశాఖ రైల్వే జోన్ రాక ఓవైపు ఆనందాన్ని కలిగించినా.. వాల్తేర్ డివిజన్ ప్రధాన కేంద్రంగా రాయగడను ప్రకటించడం అందర్నీ నిరాశకు గురిచేసింది. వాల్తేరు డివిజన్‌ను రెండు భాగాలుగా చేసి ఒక భాగాన్ని విజయవాడ డివిజన్‌లోనూ.. మరో భాగాన్ని కొత్తగా ఏర్పాటు చేయనున్న రాయగడ డివిజన్‌లోనూ కలుపుతున్నట్లు ప్రకటించింది. అయితే.. వాల్తేరు డివిజన్‌ని కొనసాగించాలంటూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కూడా పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఆ పార్టీ ఎంపీలు కూడా ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తారు. దీనిపై పునరాలోచిస్తామంటూ కేంద్రం డివిజన్ అంశాన్ని హోల్డ్‌లో పెట్టింది. ఇప్పుడు అత్యధిక రాబడిని ఇచ్చే కేకే లైన్ లేకుండానే విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ స్వరూపాన్ని ఖరారు చేస్తూ కేంద్ర రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. అరకు లోయతో సహా కేకే లైన్‌ను రాయగడ డివిజన్‌లో చేర్చింది. దాంతో కొత్తగా ఏర్పడే విశాఖ రైల్వే డివిజన్ రాబడికి భారీగా గండి పడనుంది. దీనిపై సర్వత్రా వ్యతిరేకతా వ్యక్తమవుతోంది.

కొత్త జోన్‌కు వాల్తేరే కీలకం

తూర్పు కోస్తా రైల్వే జోన్‌కు ఆదాయాన్ని తెచ్చిపెట్టే అతిపెద్ద డివిజన్ వాల్తేరు. ఏటా దాదాపు 3 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలు సాగిస్తున్నారు. తూర్పు కోస్తా రైల్వే జోన్ సరకు రవాణా, ఇతరత్రా ఆదాయం ఏటా దాదాపు రూ.17 వేల కోట్లు కాగా, ఇందులో రూ.10 వేల కోట్లు వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. సాధారణ టికెట్ల ద్వారా ఏటా రూ.788.29 కోట్లు వరకూ వస్తోంది. ఇది ఈస్ట్ కోస్ట్ జోన్ ప్రధాన కేంద్రం భువనేశ్వర్ కంటే 30 శాతం ఎక్కువ. దేశంలోనే సుమారు 300 డీజిల్ ఇంజన్లున్న అతిపెద్ద లోకోషెడ్, 160 ఇంజన్లుండే భారీ ఎలక్ట్రికల్ లోకోషెడ్, విశాలమైన మార్షలింగ్ యార్డు కూడా ఇక్కడే ఉన్నాయి. తూర్పు కోస్తాలోనే ఎక్కువ ప్యాసింజర్, సరకు రవాణా వ్యాగన్ ట్రాఫిక్ కలిగిన డివిజన్ విశాఖ. ఇందులో సింహభాగం ఆదాయం ఐరెన్ ఓర్ రవాణా జరిగే కేకే లైన్, మొదలైన ప్రధాన మార్గాల ద్వారానే వస్తుంటుంది. వాల్తేరు డివిజన్ పరిధిలో ఏటా సరకు రవాణా ద్వారా రూ.9,222.77 కోట్ల వరకూ ఆదాయం వస్తుంది. ఇప్పుడు ఇదంతా రాయగడ డివిజన్‌కు సొంతమవుతుంది. కొత్త జోన్‌కు రావాల్సిన ఆదాయం మొత్తం ఒడిశా పరిధిలోని రాయగడకు వెళ్లిపోతుంది. జోన్ అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా కేకే లైన్ వాల్తేరు పరిధిలో ఉండాల్సిందేనని డివిజన్ అధికారులు చెబుతున్నారు. కేకే లైన్ లేకపోతే.. విశాఖ డివిజన్ ఆదాయం రూ.3 వేల కోట్లు కూడా దాటే అవకాశం లేదు. దీంతో కొత్త జోన్ అభివృద్ధి సక్రమంగా జరిగే అవకాశం లేదని ఆందోళన వ్యక్తమవుతోంది.



వాల్తేరు చరిత్ర ఇదీ..

- 1893లో బ్రాడ్‌గేజ్ ఆపరేషన్స్‌తో కటక్-విశాఖ-విజయవాడ మధ్య ప్రారంభమైంది
- 1931 నుంచి వాల్తేరు డివిజన్ బెంగాల్ నాగ్‌పూర్ రైల్వే పరిధిలో నడిచింది.
- 1952 నుంచి ఈస్టర్న్ రైల్వే పరిధిలో వాల్తేరు డివిజన్ ఉండేది.
- 1955 నుంచి సౌత్ ఈస్టర్న్ రైల్వే పరిధిలోకి వెళ్లింది
- 2003 నుంచి ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలోకి వెళ్లింది
- 1968లో కేకే లైన్ ప్రారంభం
- 1996లో కొరాపుట్-రాయగడ లైన్ ప్రారంభం
- వాల్తేరు రూట్ విస్తీర్ణం- 1106 కి.మీ
- వాల్తేరు ట్రాక్ విస్తీర్ణం- 2,364 కిమీ
- మొత్తం స్టేషన్లు- 115
- డివిజన్ పరిధిలో ఉద్యోగులు- గెజిటెడ్-126, నాన్‌గెజిటెడ్- 17571



వాల్తేరుకు ప్రత్యేక గుర్తింపు

దశాబ్దానికిపైగా చరిత్ర ఉన్న వాల్తేరు డివిజన్‌ను విడదీయాలనుకోవడం సరికాదు. ఈ డివిజన్‌కు దేశ రైల్వే చరిత్రలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. కేకే లైన్ అంటే వాల్తేరు.. వాల్తేరు అంటే.. కేకే లైన్. అలాంటి ప్రాంతాన్ని రాయగడకు అప్పగించడం సరికాదు. కొత్త విశాఖ డివిజన్ వల్ల జోన్‌కు పెద్దగా ఒరిగేది లేదు. జోన్ ఎంత సెంటిమెంటో.. డివిజన్ కూడా ఉత్తరాంధ్ర ప్రజలకు అంతే సెంటిమెంట్. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు రాజీలేని పోరాటం చేయాలి.

\- బి.కృష్ణారావు, విశ్రాంత రైల్వే ఉద్యోగి

వాల్తేరు కనుమరుగైతే.. కూటమి నేతలకు ఆనందమా.?

శతాబ్దానికిపైగా చరిత్ర ఉన్న వాల్తేరును విచ్ఛిన్నం చేసి.. కొత్తగా ఆదాయ మార్గాల్లేని విశాఖ డివిజన్‌గా ప్రకటిస్తే కూటమి పార్టీలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదరు నేతలకు వాల్తేరు చరిత్ర గురించి తెలియదా అంటూ దుమ్మెత్తి పోస్తున్నారు. కేంద్రం తీసుకుంటున్న నిర్ణయం వల్ల.. విశాఖ కేంద్రంగా రాబోతున్న జోన్ ఆదాయానికి గండి పడుతుందని అంతా ఆందోళన చెందుతుంటే.. కూటమి నేతలు మాత్రం ఆనందం వ్యక్తం చేయడం సరికాదంటున్నారు. ఇప్పటికైనా మేల్కొని కేకే లైన్‌తో కూడిన విశాఖ డివిజన్ లేదా.. పాత వాల్తేరు డివిజన్ సాధించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



వాల్తేరు డివిజన్ కొనసాగించాలంటూ ఉద్యమిస్తున్న ఉద్యోగ, కార్మిక సంఘాలు(ఫైల్)

ఏపీకి తీరని అన్యాయం



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముత్యాలనాయుడు

దేవరాపల్లి: కూటమి ప్రభుత్వం వైఫల్యంతో విశాఖపట్నం రైల్వే జోన్ ఖరారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. తారువలో గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజల దీర్ఘకాలిక డిమాండ్, విభజన చట్టం హామీ అయిన విశాఖపట్నం రైల్వే జోన్‌ను అనుకున్న రీతిగా సాధించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. అత్యధిక ఆదాయాన్ని ఇచ్చే కొత్తవలస -కిరండూల్ లైన్ (కేకే లైన్), పలాస-ఇచ్ఛాపురం లైన్‌ను ఒడిశాలోని రాయగడ కేంద్రంగా ఏర్పాటు చేయనున్న కొత్త డివిజనల్‌లో చేర్చడం దారుణమన్నారు. దీంతో కొత్తగా ఏర్పడే విశాఖపట్నం రైల్వే డివిజన్ రాబడికి భారీగా గండి పడుతుందన్నారు. ఒడిశా అధిక రాబడినిచ్చే కేకే లైన్ లేని రైల్వే జోన్ వృథా అని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ధ్వజమెత్తారు.

ఒడిశా ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి రైల్వే ప్రాజెక్టులను సాధించుకోగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నష్టం జరుగుతున్నా సీఎం చంద్రబాబు కేంద్రాన్ని ప్రశ్నించకుండా ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. రాష్ట్రానికి నష్టం జరిగితే ఎంతటి వారినైనా ప్రశ్నించి, నిలదీస్తానని చెప్పిన పవన్ కల్యాణ్ గొంతు ఎందుకు మూగబోయిందని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఎద్దేవా చేశారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ స్థానానికి మరో నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న పీడీఎఫ్ మద్దతు అభ్యర్థి కోరెడ్ల విజయకుమారి

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నాలుగో రోజు ఒక నామినేషన్ దాఖలైంది. దీంతో ఎమ్మెల్సీ స్థానానికి దాఖలైన నామినేషన్ల సంఖ్య నాలుగుకు చేరుకుంది. గురువారం పీడీఎఫ్ బలపరిచిన అభ్యర్థి కోరెడ్ల విజయకుమారి తన మద్దతుదారులతో కలిసి విశాఖ ఆర్వో, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌కు సంబంధిత నామినేషన్ పత్రాలను సమర్పించారు. అనంతరం కలెక్టర్ ఆమె చేత ప్రమాణం చేయించారు. డీఆర్వో, ఏఆర్వో బి.హెచ్. భవానీ శంకర్, నోడల్ అధికారి దయానిధి, ఎన్నికల సెల్ అధికారులు అభ్యర్థికి సహకారం అందించారు.

ఆర్‌ఈసీఎస్ ఎండీగా ప్రసాద్



కశింకోట: కశింకోటలోని గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్‌ఈసీఎస్) ఎండీగా ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి సూపరింటెండింగ్ ఇంజినీర్ ప్రసాద్ నియమితులయ్యారు. ఆర్‌ఈసీఎస్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా ప్రస్తుతం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ వ్యవహరిస్తున్నారు. ఆమె ఆదేశాల మేరకు పూర్తి ఆర్‌ఈసీఎస్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రసాద్ నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్ పర్సన్ ఇన్‌చార్జిగా నియామకం కాక ముందు సహకార శాఖకు చెందిన శ్యామల పర్సన్ ఇన్‌చార్జి, ఎండీలుగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌ను ఎండీగా నియమించారు.

అనకాపల్లిలో ఉనికి లేని టీడీపీ



టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుకు వినతిపత్రం అందజేస్తున్న నియోజకవర్గ సీనియర్ నాయకులు కోట్ని రామకృష్ణదొర, బి.వెంకటేశ్వరరావు

- ఎమ్మెల్యే, ఎంపీ వేరే పార్టీల వారు
- అధికారంలో ఉన్నా గుర్తింపు దక్కడం లేదు
- క్యాడర్‌ను కాపాడుకోకపోతే మనుగడ కష్టం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడికి స్థానిక నేతల వినతి

అనకాపల్లి:

నియోజకవర్గంలో టీడీపీకి చెందిన ఎమ్మెల్యే, ఎంపీలు లేకపోవడంతో పార్టీ ఉనికి కోల్పోయే ప్రమాదముందని ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణదొర, జిల్లా కోర్ కమిటీ సభ్యుడు బి.వెంకటేశ్వరరావులు అన్నారు. గవరపాలెంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుకు గురువారం పార్టీ సీనియర్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం ఆవిర్భావం నుంచి నేటి వరకు పార్టీలు మారకుండా ఉన్న టీడీపీ సీనియర్ నాయకులకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు. 40 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలో 1989, 2004, 2009, 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి చెందినప్పటికీ పార్టీని నమ్ముకొని ఉన్నామని, ప్రస్తుత కూటమి పాలనలో టీడీపీ ప్రధాన పాత్ర పోషిస్తున్నప్పటికీ అనకాపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎంపీ గానీ టీడీపీ తరపున లేకపోవడంతో గుర్తింపు లేకుండా పోయిందన్నారు. అక్కడక్కడ అరకొరగా టీడీపీ సీనియర్ నాయకులకు చిన్నచిన్న పోస్టులు ఇచ్చి అణగతొక్కడం అన్యాయమన్నారు. కంచుకోట లాంటి అనకాపల్లిలో టీడీపీకి పట్టులేకుండా పోతోందని, ఈ విషయంపై పార్టీ సీనియర్ నాయకులు దృష్టి సారించాలని, లేని పక్షంలో రానున్న రోజుల్లో ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

పార్టీలు మారి వచ్చిన వ్యక్తులకు పదవులు కట్టబెట్టడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈవిషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు వినతిప్రతం ద్వారా తెలియజేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో టీడీపీ సీనియర్ నాయకులు కె.నారాయణరావు, కె.జగన్మోహనరావు, గుడాల సత్యనారాయణ ముదిరాజ్, భరణికాన శ్రీనివాసరావు, గొలగాని నాగేశ్వరరావు, కర్రి మల్లేశ్వరరావు, యడ్ల కాశీ, వివి రమణబాబు, ఎస్.శ్రీనివాసరావు, మళ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ రోడ్డు మూసివేత

- కాలనీ పక్కనే వివాదాస్పద జిరాయితీ భూమి
- స్టేటస్‌కో ఉత్తర్వులను అడ్డుపెట్టుకొని అడ్డంగా రాళ్లు పాతిన రెవెన్యూ సిబ్బంది
- కూటమి నేతల రాజకీయమే ఇందుకు కారణమని కాలనీవాసుల ఆందోళన



తాగునీరు తెచ్చుకోవడానికి దారి చూపించాలని పంచాయతీ కార్యదర్శిని వేడుకుంటున్న మహిళలు



కూటమి నేతల ఒత్తిళ్లతో జగనన్న కాలనీ రోడ్డుకు అడ్డుగా రాళ్లు పేర్చి కట్టిన బ్యానర్

నాతవరం: కూటమి నేతలతో కుమ్మక్కైన రెవెన్యూ అధికారులు జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డును గురువారం మూసేయడంతో కాలనీవాసులు ఆందోళన చేస్తున్నారు. మండలంలో మన్యపురట్ల పంచాయతీలో సర్వే నెంబరు 34/1లో 82 సెంట్ల ప్రభుత్వ భూమిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీకి కేటాయించారు. ఈ భూమిలో సుమారు 40 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి అప్పటి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ హౌసింగ్ కాలనీ మంజూరు చేశారు. కాలనీలో 33మంది వరకు ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారు. మిగతా వారు వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్నారు. ఇదే జగనన్న కాలనీని ఆనుకొని అనంత పద్మనాభపురం రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వ జిరాయితీ భూములు ఉన్నాయి. ఈ భూమి కోసం మన్యపురట్ల గ్రామానికి చెందిన వ్యక్తులు రాజకీయ కారణంతో కోర్టును ఆశ్రయించారు. అనంత పద్మనాభపురం రెవెన్యూ పరిధిలో 7 ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి 2022లో కోర్టు స్టేటస్‌కో ఆర్డరు ఇచ్చిందని మాజీ సర్పంచ్ ముత్తా శివాజీ తెలిపారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు ఆ సంవత్సరమే నిలిపివేశారని చెప్పారు. కోర్టు ఇచ్చిన స్టేటస్‌కో ఆర్డరును సాకుగా చూపి.. అధికారాన్ని అడ్డుపెట్టుకొని.. ఇప్పుడు కూటమి నేతలు జగనన్న కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డును తహసీల్దార్ ఆదేశాలతో మూసేశారు. జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డుకు అడ్డుగా రాళ్లు పేర్చి దారి బ్లాక్ చేశారు.

కాలనీవాసుల ఆందోళన

కోర్టు పరిధిలో ఉన్న అనంత పద్మనాభపురం రెవెన్యూ గ్రామానికి చెందిన స్థలాన్ని కాకుండా మన్యపురట్ల గ్రామంలో జగనన్న కాలనీ రోడ్డు మూసేయడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము నిత్యావసర సరకులు, తాగునీరు తెచ్చుకోవాలంటే మన్యపురట్ల గ్రామానికి వెళ్లేందుకు ఈ రోడ్డు ఒక్కటే ఆధారమని, జగనన్న కాలనీ నుంచి బయటకు రావడానికి తమకు దారి చూపించాలంటూ గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మహిళలు రోడ్డుపై ఆందోళనకు దిగారు. కాలనీవాసుల ఆందోళన గురించి తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ అక్కడకు వెళ్లి వారితో మాట్లాడారు. కనీసం తాగునీరు తెచ్చుకోవడానికైన రోడ్డు మార్గం చూపించాలంటూ మహిళలు పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ వద్ద వాపోయారు, మీ రోడ్డు సమస్యను వెంటనే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తానని పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ మహిళలకు భరోసా ఇచ్చారు.

ఈ విషయంపై తహసీల్దార్ ఎ.వేణుగోపాల్‌ను వివవరణ కోరగా.. తాను వేరొక పనిమీద బయట ఉన్నానని, గ్రామంలోకి వెళ్లి అక్కడ పరిస్థితి పరిశీలించి రోడ్డుకు అటంకం లేకుండా చేస్తానన్నారు.

దివ్యాంగుల క్రికెట్ జట్ల ఎంపిక రేపు

విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ స్టేడియం బి గ్రౌండ్‌లో ఈ నెల 8న దివ్యాంగుల క్రికెట్ జట్ల ఎంపిక జరగనుంది. ఫిజికల్లీ డిజేబుల్డ్, బ్లైండ్, వీల్‌చైర్, మూగ కేటగిరీల్లో ఎంపిక ఉంటుందని ఏసీఏ డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ చైర్మన్ సూర్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర క్రికెట్ సంఘం అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్‌బాబు ఆదేశాలతో ఎంపిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విశాఖతో పాటు అనకాపల్లి జిల్లాకు చెందిన దివ్యాంగులు ఆయా కేటగిరీల్లో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఎంపికల్లో తెలుపు దుస్తులు ధరించి పాల్గొనాలన్నారు.

సాంకేతిక లోపంతోనే జీతం అందలేదు

- సుందరానికి వారంలో రోజుల్లో బకాయిల చెల్లింపు
- జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావు

మాడుగుల: మాడుగుల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుందరం జీతం ఏడాదిగా అందలేదని సాక్షిలో ప్రచురితమైన వార్తకు జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మధరావు స్పందించారు. గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు సీఎఫ్ఎంఎస్‌లో అతని పేరు మోడిఫైడ్ చేయకపోవడం వలనే సీనియర్ అసిస్టెంట్ సుందరానికి జీతం అందలేదన్నారు. ఈ సాంకేతిక లోపాన్ని ట్రెజరీలో సరిచేసి వారం రోజుల్లో జీతం మొత్తం అందజేయడానికి కృషి చేస్తామన్నారు.

అన్ని రకాల రిజిస్ట్రేషన్లు సులభతరం: డీఐజీ బాలకృష్ణ

ఈనెల నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగడం వలన అన్ని రకాల రిజిస్ట్రేషన్లు సులభతరం చేస్తామని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల డీఐజీ జి.బాలకృష్ణ అన్నారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఆన్‌లైన్ ప్రక్రియను మరింత సులభంగా మారుస్తామన్నారు. సీనియర్ అసిస్టెంట్ సుందరం జీతం వారం రోజుల్లో అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సాగరం.. సాహస జీవనం







ఏయూ క్యాంపస్: సాగరం ఎందరికో జీవనాధారం. ముఖ్యంగా మత్స్యకారులకు అదే ప్రధాన ఆధారం. మత్స్యకారుల జీవితం ఎప్పుడూ ఒకేలా సాగదు. ఒక్కోసారి చేపలు సమృద్ధిగా లభిస్తాయి. ఒక్కోసారి తీవ్ర కష్టాలు ఎదురవుతాయి. తుపానులు, ప్రకృతి వైపరీత్యాలు వారి జీవితాలను అతలాకుతలం చేస్తాయి. అయినా వారు సహనంతో ఉంటారు. కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటూ జీవిస్తారు. సముద్రంతో నిరంతరం పోరాడుతూనే ఉంటారు. ఇలాంటి దృశ్యాలు విశాఖ తీరం వెంబడి నిత్యం దర్శనమిస్తుంటాయి. ఫిషింగ్ హార్బర్ వద్ద చేపలు రిక్షాపై తీసుకువెళుతున్న కార్మికుడు, పెదజాలారిపేట వద్ద వేట ముగించుకుని ఇంటికి చేరుతున్న మత్స్యకారులు, తీరంలో బోట్లను నిలిపిన సుందర దృశ్యాలు వారి జీవనాన్ని, విశాఖ సాగర తీర సౌందర్యాన్ని కళ్లకు ముందుంచుతాయి. కురుసుర మ్యూజియం పక్కనే సముద్రంలో వేసిన భారీ వలను తీరానికి లాగుతూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న మత్స్యకారులు.. ఇలా ప్రతీ దృశ్యం వెనుక ఒక గాథ దాగి ఉంటుంది. ఇలాంటి దృశ్యాలను సాక్షి తన కెమెరాలో బంధించింది. – ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రభుత్వాస్పత్రిలో గుండెపోటుకు తక్షణ చికిత్స

- స్టెమీ గది ఏర్పాటు
- గోల్డెన్ అవర్‌లో ఇంజెక్షన్‌తో తప్పనున్న ప్రాణాపాయం


యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో స్టెమీ గది

యలమంచిలి రూరల్: శరీరంలో గుండె చాలా సున్నితమైన ప్రధానమైన అవయవం. గుండెపోటుతో మరణించే వారి సంఖ్య కూడా ఎక్కువే. గుండెపోటు వచ్చిన వెంటనే సకాలంలో వైద్యుడ్ని సంప్రదిస్తే ప్రాణాపాయం ముప్పు నుంచి కాపాడ్డానికి వీలుగా యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో గురువారం స్టెమీ గదిని ఏర్పాటు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైద్యానికి అత్యంత ప్రాధాన్యమిచ్చి గుండెపోటుతో ఆస్పత్రికి వచ్చే హృద్రోగులను కాపాడేందుకు రూ.46 వేల విలువైన టెనెక్ట్‌ప్లేజ్ ఇంజెక్షన్ ఉచితంగా ఇవ్వడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద వర్గాలకు చెందిన వారు గుండెపోటుతో వైద్యం అందేలోపే ప్రాణాలు కోల్పోతుండడాన్ని గుర్తించిన గత ప్రభుత్వం ఇందుకు అవసరమైన చికిత్సను ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిద్ధం చేసింది. గత ఏడాది యలమంచిలి ప్రభుత్వాస్పత్రిని పాత భవనం నుంచి కొత్త భవనంలోకి మార్చారు. అప్పట్నుంచి స్టెమీ గదిని ఏర్పాటు చేయలేదు. కొత్త భవనంలో కూడా స్టెమీ గదిని ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో గురువారం యలమంచిలి సీహెచ్‌సీలో స్టెమీ గదిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుభాష్ ప్రారంభించారు. గుండెపోటు వచ్చిన 4 నుంచి 6 గంటల సమయాన్ని గోల్డెన్ అవర్ అంటారని, ఆ సమయంలోగా వస్తే ఇక్కడే ఈసీజీ తీసి నిపుణులైన కార్డియాలజిస్టుకు ఆ రిపోర్టును వాట్సాప్ ద్వారా పంపించి తగు చికిత్స అందజేస్తామన్నారు. గుండెపోటుతో వచ్చిన రోగిని ప్రాణాపాయం నుంచి రక్షించడానికి ఆస్పత్రిలో ఖరీదైన టెనెక్ట్‌ప్లేజ్ ఇంజెక్షన్ సిద్ధంగా ఉందని ఈ సౌకర్యాన్ని అందరూ ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు.

ఎం.అలమండ సర్పంచ్ సస్పెన్షన్‌పై హైకోర్టు స్టే

- కక్ష సాధింపు, అసత్య ఆరోపణలతో టీడీపీ నేత తప్పుడు ఫిర్యాదు


ఎం.అలమండలో గ్రామస్తులతో కలిసి మాట్లాడుతున్న సర్పంచ్ దాడి జగన్నాథరావు

దేవరాపల్లి: మండలంలోని ఎం.అలమండ గ్రామ సర్పంచ్ దాడి జగన్నాథరావు(జగన్) సస్పెన్షన్‌పై హైకోర్టు స్టే విధించింది. సర్పంచ్‌పై ఆరోపణలు చేస్తూ అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గతేడాది జూన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిగింది. అధికారుల నివేదిక ఆధారంగా సర్పంచ్‌ని మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తూ కలెక్టర్ విజయ కృష్ణన్ గతేడాది డిసెంబర్‌లో ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఇచ్చిన సస్పెన్షన్ ఉత్తర్వులపై సర్పంచ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ రిట్ పిటిషన్‌పై విచారించిన హైకోర్టు.. సర్పంచ్ సస్పెన్షన్‌పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా అధికారులకు హైకోర్టు గడువు విధించింది.

అంతిమంగా న్యాయమే గెలుస్తోంది: సర్పంచ్ దాడి జగన్

రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అధికార టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు అసత్య ఆరోపణలతో తనపై తప్పుడు ఫిర్యాదు చేశారని, అంతిమంగా న్యాయమే గెలుస్తుందని సర్పంచ్ దాడి జగన్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఎం.అలమండలో స్థానిక నాయకులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఏ తప్పు చేయలేదని, తన గురించి గ్రామ ప్రజలకు బాగా తెలుసునన్నారు. ఉప సర్పంచ్ సిరపరపు గంగాధర్‌రావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బండారు ప్రసాదరావు, వార్డు సభ్యుడు చీపురుపల్లి గోవింద, పాల సంఘం అధ్యక్షుడు పొలిపిరెడ్డి రమణ, గురె అశోక్, రొంగలి మంగునాయుడు, కామిరెడ్డి గోవింద, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్థలం ఆక్రమించారు.. న్యాయం చేయండి


సమస్యాత్మక స్థలాన్ని పరిశీలిస్తున్న కంబాల జోగులు, చిక్కాల

పాయకరావుపేట: తన స్థలం ఆక్రమించారని తనకు న్యాయం చేయాలని పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన పీతల ప్రసాద్ భార్య రత్నం వైఎస్సార్ సీపీ నాయకులకు గురువారం విన్నవించుకున్నారు. ఈ మేరకు ఆ స్థలాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పరిశీలించారు. గతంలో తనకు ఇంటి స్థలం ఇచ్చారని, టీడీపీ నాయకులు ఆ స్థలాన్ని ఆక్రమించి రోడ్డు, గోడ నిర్మాణం చేపట్టారని రత్నం ఆరోపించారు. స్థలం ఆక్రమణ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. పార్టీ జిల్లా ప్రచార విభాగం మాజీ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి.నానాజీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగనే మంచి ముఖ్యమంత్రి.. ఇది జనం మాట

- ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ

సీతమ్మధార: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచిస్తున్నారని ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ ఓ ప్రకటనలో మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు నాణ్యమైన మద్యం అమలు చేస్తామని చెప్పి.. రాష్ట్రంలో బెల్ట్ షాపులకు గేట్లు తెరిచారని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి డకౌట్ అయ్యారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం తీయకపోగా.. ఉన్న వలంటీర్లను తీసేశారని దుయ్యబట్టారు. గొర్రె కసాయి వాడిని నమ్మినట్టు.. రాష్ట్ర ప్రజలు చంద్రబాబుని నమ్మారన్నారు. మంచి ముఖ్యమంత్రి జగనేనని ప్రజలు తెలుసుకుంటున్నారని, చాలా చోట్ల జనం ఇదే మాట అనుకుంటుంటే విన్నానని దేవిశ్రీ చెప్పారు. ఇప్పటికైనా హామీలు అమలు చేయాలని చంద్రబాబును డిమాండ్ చేశారు.

క్రైం రేటు తగ్గాలి

- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు
- నక్కపల్లి, ఎస్.రాయవరం స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ తుహిన్ సిన్హా


నక్కపల్లి స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

నక్కపల్లి/ఎస్.రాయవరం: నక్కపల్లి సర్కిల్ పరిధిలో క్రైమ్ రేట్ తగ్గించేందుకు పోలీస్ సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. గురువారం నక్కపల్లి, ఎస్.రాయవరం పోలీసు స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి, ఇతర కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గంలో సుమారు 30 కిలోమీటర్ల దూరం కలిగిన జాతీయ రహదారి ఉందన్నారు. తరుచుగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు అరికట్టే విషయంలో ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రతి చిన్న విషయానికి పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగకుండా స్థానిక పంచాయతీల్లో పరిష్కరించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబులను అభినందించారు. తొలుత సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సిబ్బంది యోగక్షేమాలు తెలుసుకొని, ఇబ్బంది వుంటే నేరుగా తనను కలవాలన్నారు. అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావులు ఎస్పీ పర్యటనలో పాల్గొన్నారు.

ఫార్మాలో గాయపడిన కార్మికుడికి న్యాయం చేయాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేముడునాయుడు డిమాండ్
- స్పాన్‌లైఫ్ సైన్సెస్ ఫార్మా ఎదుట ఆందోళన


స్పాన్‌లైఫ్ సైన్సెస్ ఫార్మా ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, బాధిత కార్మికుడి కుటుంబ సభ్యులు

రాంబిల్లి(యలమంచిలి): అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో స్పాన్‌లైఫ్ సైన్సెస్ ఫార్మా ప్రైవేట్ పరిశ్రమలో గత నెల 24న ప్రమాదావశాత్తు గాయపడిన ఎలక్ట్రిషియన్ నాగల ఆనంద్ కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఫార్మా పరిశ్రమ గేట్ వద్ద సీఐటీయూ నేతలు, ఆనంద్ కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలో జరిగిన ప్రమాదంలో గాయపడిన ఆనంద్‌కు యాజమాన్యం ఆస్పత్రిలో చికిత్స చేయించి చేతులు దులుపుకొందని ఆరోపించారు. ఎటువంటి ఆర్థిక సహాయం చేయలేదన్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించి, కంపెనీలో తాను చేయగలిగే ఉద్యోగం ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని, లేని పక్షంలో ఆ కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం అందించాలన్నారు. కంపెనీ ఎదుట గాయపడిన ఆనంద్‌తో కలసి న్యాయం చేయాలని కటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించినా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.రాము, ఆనంద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎగుమతుల రంగంలో ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న దువ్వాడ ఎస్ఈజెడ్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్

అక్కిరెడ్డిపాలెం: మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) విశాఖ శాఖ, డీజీఎఫ్‌టీ, వాసీవా, ఏపీ చాంబర్ సంయుక్త ఆధ్వర్యంలో ఎగుమతి ప్రోత్సాహం, ఎంఎస్ఎంఈ పథకాలపై గురువారం ఒక్క రోజు జాతీయ వర్క్ షాపు జరిగింది. షీలానగర్‌లోని ఒక హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దువ్వాడ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎగుమతుల ప్రోత్సాహకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దువ్వాడ ఎస్ఈజెడ్‌లో అందుబాటులో ఉన్న వివిధ సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. వివిధ ఎగుమతుల ప్రోత్సాహక పథకాలు, నిరాయత్ బంధు పథకాల గురించి వివరించారు. ఎగుమతుల రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. పరిశ్రమల జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు కావాల్సిన అన్ని రకాల అనుమతులు, విధివిధానాలను వివరించారు. పలువురు పారిశ్రామికవేత్తలు మాట్లాడుతూ ప్రొక్యూర్‌మెంట్ పాలసీని పక్కాగా అమలు చేయాలని కోరారు. రూరల్ ఏరియాలో ఎంఎస్ఎంఈలను ఇంకా అభివృద్ధి చేయాలని అభిప్రాయపడ్డారు. భారత విదేశీ వాణిజ్య సంస్థ (డీజీఎఫ్టీ), కస్టమ్స్ డిపార్ట్‌మెంట్, ఎగుమతి క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్, భారత పోస్టల్ శాఖ, ఎగుమతుల తనిఖీ మండలి, ఏపీఈడీఏ, ఎఫ్ఐఈవో, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు, పలు బ్యాంకుల అధికారులు అమలు చేస్తున్న పథకాలు, విధి విధానాలను వివరించారు. విశాఖ డీఎఫ్‌వో ఎంఎస్ఎంఈ ఏడీ శ్రీను అప్పికొండ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ ఏడీ చంద్ర మౌళి జంగం, ఎస్ఈజెడ్ లీ ఫార్మా అధికారి లీలా రాణి, విశాఖపట్నం ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ చిరంజన్ దత్తా, వాసీవా సంయుక్త కార్యదర్శి ఇ.అనార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి
చికిత్స పొందుతూ మృతి

రాంబిల్లి(యలమంచిలి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రాంబిల్లి మండలం కట్టుబోలు గ్రామానికి చెందిన కర్రి దాలినాయుడు(58) ఈ నెల 3న ఆర్థిక సమస్యల కారణంగా తన ఇంటి వద్ద పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఆయనను కుటుంబ సభ్యులు విశాఖపట్నం కేజీహెచ్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని భార్య కర్రి అమ్మాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కేజీహెచ్‌లో బాలిక ప్రసవం

- కేసు నమోదు చేసిన పోలీసులు

భీమునిపట్నం : బాలిక ప్రసవంపై గురువారం భీమిలి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ బొడ్డేపల్లి సుధాకర్ తెలిపిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా చీడికాడకు చెందిన 17 ఏళ్ల బాలిక భీమిలిలోని ఓ వసతి గృహంలో ఉంటూ కళాశాలలో చదువుతోంది. చీడికాడకు చెందిన 18 ఏళ్ల యువకుడితో చనువుగా ఉంటోంది. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చింది. ఈ విషయం ఎవరికీ తెలియకుండా దాచిపెట్టింది. గురువారం ఉదయం కడుపు నొప్పి రావడంతో కేజీహెచ్‌కు వెళ్లగా.. వైద్యులు పరీక్షించి ప్రసవం చేశారు. మగబిడ్డ పుట్టి చనిపోయాడు. కాగా బాలిక ప్రసవం కావడంపై కేజీహెచ్ వైద్యులు భీమిలి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై బాలిక నుంచి వివరాలను సేకరించినట్లు సీఐ తెలిపారు. ఇది చీడికాడకు సంబంధించి వ్యవహారం కావడంతో అక్కడ పోలీసులకు ఈ కేసు వివరాలు అందిస్తామన్నారు.

ఊహకందని కథతో 'తల'


సమావేశంలో పాల్గొన్న చిత్ర యూనిట్

బీచ్‌రోడ్డు: ప్రేక్షకుల ఊహలకు అందని ఎన్నో మలుపులతో 'తల' సినిమా ఉంటుందని దర్శకుడు అమ్మ రాజశేఖర్ అన్నారు. తల చిత్ర ప్రమోషన్‌లో భాగంగా బుధవారం నగరంలో హీరో, దర్శకుడు, సినిమా బృందం సందడి చేసింది. ఈ సందర్భంగా సిరిపురంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దర్శకుడు మాట్లాడారు. ఈ నెల 14న ప్రపంచవ్యాప్తంగా తల సినిమా విడుదలవుతుందని, ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందన్నారు. ప్రస్తుతం టీనేజ్ ప్రేక్షకులే అధికంగా సినిమా థియేటర్లకు వస్తున్నారన్నారు. అమ్మ రాజశేఖర్ కుమారుడు, హీరో రాగిని రాజ్ మాట్లాడుతూ చాలా మంది నటులు ప్రేమ కథలతోనే పరిచయమవుతారని, తాను ఓ మంచి కంటెంట్ ఉన్న కథతో హీరోగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నట్లు తెలిపారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందన్నారు. హాస్య నటుడు అవినాష్ మాట్లాడుతూ బిగ్‌బాస్ షోలో ఇచ్చిన మాట ప్రకారం అమ్మ రాజ శేఖర్ ఈ సినిమాలో తనకు అవకాశం ఇచ్చారని ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రేమికుల దినోత్సవం రోజున వైలెంట్ వాలెంటైన్‌గా హీరో అందరికీ నచ్చుతాడన్నారు.

అనకాపల్లిలో వైనాట్ షోరూం ప్రారంభోత్సవం


ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సీనియర్ జనరల్ మేనేజర్ కరాటం వెంకట కృష్ణాజీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఐఎఫ్‌బీ బ్రాంచి మేనేజర్ సుధీర్

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర పూడిమడక రోడ్‌లో వైనాట్ షోరూమ్ గురువారం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సీనియర్ జనరల్ మేనేజర్ కరాటం వెంకట కృష్ణాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లిలో మరింత మంది ఖాతాదారులకు అధునాతన ఎలక్ట్రానిక్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా మొదటి 10 మంది ఖాతాదారులకు ప్రత్యేక బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌బీ బ్రాంచి మేనేజర్ సుధీర్, బ్రాంచి మేనేజర్ రహీమ్‌లాయడ్, ఎల్‌జీ బ్రాంచి మేనేజర్ యుగంధర్, సోని బ్రాంచి మేనేజర్ భాస్కర్, వివిధ కంపెనీల ఏరియా మేనేజర్లు, వినియోగదారులు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలో తగ్గిన కేంద్ర ఆర్థిక సాయం


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మధురవాడ : చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత కేంద్రం నుంచి ఆర్థిక సహకారం తగ్గిందని.. ఈ విషయం సాక్షాత్తు ఆర్థిక శాఖ అధికారులే ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో వివరించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో మధురవాడ వాంబే కాలనీలో పేదల ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు నింపేందుకు చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం లేకున్నా బ్రహ్మాండం అంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ అదే పనిగా పొగుడుతున్నారన్నారు. వాస్తవంగా లెక్కలు చూస్తే 2023–24 కంటే 2024–25లో దాదాపు 3,300 కోట్లు ఆర్థిక సహాయం తగ్గిందన్నారు. 2024–25లో కేంద్రం ఆర్థిక సహాయంపై ముఖ్యమంత్రి శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఈ ఏడు నెలల కాలంలో రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్లు ఆర్థిక సాయం చేశామని చెబుతున్నారన్నారు. ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. లేకుంటే చలో అసెంబ్లీ చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. తర్వాత వాంబేకాలనీలో ఉన్న యూపీహెచ్‌సీని సందర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, మధురవాడ ఏరియా కార్యదర్శి వి.సత్యన్నారాయణ, జిల్లా నాయకులు ఎంఎ బేగం, జేడీ నాయుడు, వి.కేశవయ్య, ఎంఎస్ పాత్రుడు, కె.జగ్గస్వామి పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా కోసం పలు ప్రత్యేక రైళ్లు నడుపుతుంది. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, తిరుపతి, గుంటూరు స్టేషన్ల నుంచి బయల్దేరుతుతున్న ప్రత్యేక రైళ్లు ఇలా ఉన్నాయి.

- విశాఖపట్నం–పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్(08530) స్పెషల్ విశాఖలో ఈ నెల 6, 20, 27వ తేదీల్లో సాయంత్రం 5.35 గంటలకు బయల్దేరి ఈ నెల 8, 22, మార్చి 1వ తేదీల్లో తెల్లవారుజామున 4.30 గంటలకు పండిట్‌దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 08529 స్పెషల్ ఈ నెల 8, 22, మార్చి 1వ తేదీల్లో రాత్రి 8.10గంటలకు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్‌లో బయల్దేరి ఈ నెల 10, 24, మార్చి 3వ తేదీల్లో తెల్లవారుజామున 3.25 గంటలకు విశాఖ చేరుకుంటుంది.
- విశాఖ–గోరఖ్‌పూర్(08562) స్పెషల్ ఈ నెల 16న రాత్రి 10.20 గంటలకు విశాఖలో బయల్దేరి 18న రాత్రి 8.25 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గోరఖ్‌పూర్–విశాఖ(08561) స్పెషల్ ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం 2.20 గంటలకు బయల్దేరి 21వ తేదీ మధ్యాహ్నం 12.15 గంటలకు విశాఖ చేరుకుంటుంది.
- కాకినాడటౌన్–గయ జంక్షన్(07095) స్పెషల్ ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు కాకినాడలో బయలేరుతుంది. తిరుగు ప్రయాణంలో గయ జంక్షన్–విజయవాడ(07096) స్పెషల్ గయ జంక్షన్‌లో ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 2.15 గంటలకు బయల్దేరి విజయవాడ చేరుకుంటుంది.
- తిరుపతి–బనారస్(07107) స్పెషల్ ఈ నెల 8, 15, 22వ తేదీల్లో రాత్రి 8.55 గంటలకు తిరుపతిలో బయల్దేరి బనారస్ చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో బనారస్–విజయవాడ (07108) ఈ నెల 10, 17, 24వ తేదీల్లో సాయంత్రం 5.30 గంటలకు బనారస్‌లో బయల్దేరి విజయవాడ చేరుకుంటాయి.
- గుంటూరు జంక్షన్–ఆజంగర్(07081) స్పెషల్ ఈనెల 14వ తేదీన గుంటూరులో రాత్రి 11గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఆజంగర్–విజయవాడ (07082) స్పెషల్ ఈనెల 16వ తేదీన ఆజంగడ్‌లో రాత్రి 7.45 గంటలకు బయల్దేరుతుంది.
- కాకినాడ టౌన్–ఆజంగర్(07085) స్పెషల్ ఈ నెల 20వ తేదీ రాత్రి 8.10 గంటలకు కాకినాడ టౌన్‌లో బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఆజంగడ్–విజయవాడ (07086) స్పెషల్ ఈ నెల 22వ తేదీ రాత్రి 7.45 గంటలకు ఆజంగడ్‌లో బయల్దేరుతుంది.

రసాయనాలు లేకుండా వ్యవసాయం సాధ్యం

- ఏపీసీఎన్ఎఫ్‌ను మోడల్‌ను అభినందించిన శ్రీలంక ప్రతినిధి బృందం


శ్రీలంక ప్రతినిధి చమారిని అభినందిస్తున్న రైతు సాధికార సంస్థ ప్రతినిధి కృష్ణారావు


నగరంలో ఒక హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీలంక ప్రతినిధి బృందం

మహారాణిపేట: ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలను అనుసరించడం ద్వారా రసాయనాలను ఉపయోగించకుండా వ్యవసాయం సాధ్యమని శ్రీలంక ప్రతినిధి బృందం, రైతులు తెలిపారు. రైతు సాధికార సంస్థ(ఆర్‌వైఎస్ఎస్) రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) నమూనా బృంద సభ్యులను ఆకట్టుకుంది. రాష్ట్రంలో 11 రోజుల పాటు పర్యటన పూర్తి చేసుకున్న శ్రీలంక ప్రతినిధి బృందం గురువారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తమ అనుభవాలను పంచుకుంది. ఈ సందర్భంగా శ్రీలంక సర్వోదయ ఫౌండేషన్ ప్రతినిధి చమారి మాట్లాడుతూ రైతులు అమలు చేస్తున్న ఏటీఎం(ఎనీ టైం మనీ), ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఏ గ్రేడ్ వంటి విభిన్న నమూనాల ద్వారా తాము చాలా అంశాలు నేర్చుకున్నట్లు తెలిపారు. కొంత మంది రైతులు తమ దేశంలో రసాయనాలు వాడుతున్నారని, ప్రకృతి వ్యవసాయ విధానంలో రసాయనాలు అవసరం లేకుండా ప్రకృతి వ్యవసాయం చేయవచ్చని గ్రహించామన్నారు. శ్రీలంక దేశంలో కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అమలు చేయడానికి ఉత్సాహంగా ఉన్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శనలను ఏర్పాటు చేసిన ఆర్‌వైఎస్ఎస్‌కు కృతజ్ఞతలు చెప్పారు. ప్రియదర్శిని అనే మహిళ రైతు మాట్లాడుతూ ఏటీఎం మోడల్‌పై ఆసక్తి ఏర్పడిందన్నారు. శ్రీలంకలో నీరు ఎక్కువగా లభ్యమవుతుందని.. ఏటీఎం(ఎనీటైం మనీ) తక్కువ నీటితో కూడా అమలు చేయగలిగే విధానమన్నారు. అనంతపురం వంటి పొడి ప్రాంతాల్లో కూడా ఉపయోపడగేలా తీర్చిద్దారని కొనియాడారు. ఈ మోడల్‌ను శ్రీలంకలో విస్తరించేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ వర్చువల్‌గా సమావేశంలో పాల్గొని.. ప్రకృతి వ్యవసాయం ప్రారంభించేందుకు ఆసక్తి చూపించిన శ్రీలంక రైతులను అభినందించారు. రైతు సాధికార సంస్థ ప్రతినిధులు వి.కృష్ణారావు,హేమ సుందర్, ప్రకాష్‌రావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆన్‌లైన్ యోగా పోటీల్లో చిన్నారి ప్రతిభ



దైవజ్ఞకు అభినందనలు తెలుపుతున్న స్కూలు కరస్పాండెంట్ అనూరాధ

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూలుకు చెందిన మూడో తరగతి విద్యార్థిని ఎం. దైవజ్ఞ ఆన్‌లైన్ యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచి అవార్డు కైవసం చేసుకుంది. శివజ్యోతి యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఇటీవల ఈ పోటీలు నిర్వహించారు. ఆమెను స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం మాట్లాడుతూ చిన్న వయస్సులోనే తన ప్రతిభతో యోగాలో రాణించడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. ప్రిన్సిపాల్ రూపనంది, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

అధిక లోడ్ లారీలపై కేసులు



వేటజంగాలపాలెంలో అధిక లోడుతో వెళ్తున్న లారీలు

అనకాపల్లి: మండలంలో వేటజంగాలపాలెం రహదారిలో అధిక లోడుతో ప్రయాణిస్తున్న క్వారీ లారీలపై కేసులు నమోదు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ రవికుమార్ గురువారం తెలిపారు. పరిమితికి మించి లారీల్లో లోడింగ్ చేసి ప్రయాణించడం వల్ల రహదారులు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ మేరకు ఐదు లారీలపై కేసులు నమోదు చేశామన్నారు.

'ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలపై దృష్టి పెట్టాలి'

అనకాపల్లి టౌన్: జిల్లాలో భద్రతా ప్రమాణాలు పాటించని ఫార్మా కంపెనీలపై ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించినట్లయితే ప్రమాదాలను నివారించవచ్చని ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ గురువారం ఒక ప్రకటలో కోరారు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయన్నారు. వీటిపై ప్రత్యేక పర్యవేక్షణ లేకపోవడంతో ఫార్మా కంపెనీల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. కాలం చెల్లిన యంత్రాలతో కార్మికులు విధులు నిర్వహించడం వల్ల ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో జిల్లా అధికార యంత్రాంగం హడావిడి చేసి, తర్వాత చేతులు దులుపుకుంటుందని ఆరోపించారు. ప్రమాదాల్లో బడుగు, బలహీన వర్గాల చిరుఉద్యోగులు క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారని వాపోయారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 7,967 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
మొదటి రకం	3,420	4,140
రెండో రకం	3,090	3,630
మూడోరకం	2,800	3,070

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్ : రాజా
పుష్ప-2 : సత్యనారాయణ స్క్రీన్-1
ఒక పథకం ప్రకారం : సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్ : పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం : షిర్డీసాయి
పట్టుదల : వెంకటేశ్వర
గేమ్ ఛేంజర్ : శ్రీసత్య (ఉదయం, మొదటి షో)
మదగజరాజ : శ్రీసత్య(మేట్నీ, రెండో షో)
భవాని వార్డు : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 105 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-36 యూనిట్లు, ఓ పాజిటివ్-52 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 395 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 366 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

- రోడ్లపైనే చిరువ్యాపారాలు
- పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్య
- రింగ్‌రోడ్డు మార్కెట్ యార్డులో నిరుపయోగంగా షెడ్లు
- పట్టించుకోని కూటమి పాలకులు



పట్టణ మెయిన్‌రోడ్డులో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు

అనకాపల్లి: జిల్లా కేంద్రానికి తగ్గటుగా అనకాపల్లి పట్టణాన్ని అభివృద్ధి చేయడంలో జీవీఎంసీ అధికారులు, కూటమి పాలకులు విఫలమయ్యారు. పర్యవసానంగా రహదారులపైన, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చిరువ్యాపారాలు చేస్తున్నారు. దాంతో పట్టణం నలుగువైపులా మెయిన్‌రోడ్డులో అడుగు తీసి ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పైగా ఇరుకు రోడ్లు కావడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య



ఫుట్‌పాత్‌పై వ్యాపారం



ఫుట్‌పాత్ ఆక్రమించి వ్యాపారం

ఏర్పడుతోంది. ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పాదచారులు రోడ్లపై నడుకుంటూ వెళ్లే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు.

పట్టణం నలువైపులా మెయిన్‌రోడ్డులో ఇక్కట్లు

జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత పట్టణ ప్రాధాన్యత పెరిగింది. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడ ఏర్పాటు కావడంతో అధికారులతోపాటు వివిధ సమస్యలపై వస్తున్న ప్రజలు, ఇతర అవసరాల రీత్యా వచ్చే వాహనదారులు, ప్రయాణికులతో నిత్యం రద్దీగా మారుతోంది. ప్రధానంగా పట్టణంలో నెహ్రూ చౌక్ నుంచి సుంకరమెట్ట జంక్షన్, పూడిమడక జాతీయ రహదారి, శారదాబ్రిడ్జి, గుండా జంక్షన్ వరకూ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేయడంతో ఉదయం, సాయంత్రం సమయంలో విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసులు, జీవీఎంసీ అధికారులు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించడం లేదు. పర్యవసానంగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ సమయంలో హడావుడి చేసి తర్వాత షరా మామూలే అన్నట్టు వదిలేస్తున్నారు. రెండు మూడ్రోజులకే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోంది. కొన్ని దుకాణాలకు సెల్లార్లు ఉన్నప్పటికీ వాటిని వాడకుండానే రోడ్లపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. దీనివల్ల పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొందరు వ్యాపారులు రోడ్డు మీదే వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే వివిధ వర్గాల ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు.

నిరుపయోగంగా ఎన్టీఆర్ మార్కెట్లో దుకాణాలు

స్థానిక రింగ్‌రోడ్డు ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు ఆవరణలో 20 సంవత్సరాల క్రితం చిరువ్యాపారులకు కొత్తగా నాలుగు యార్డులను ఏర్పాటు చేశారు. ప్రసుత్తం అవి నిరుపయోగంగా ఉన్నాయి. కరోనా వంటి విపత్తుల సమయంలో చిరు వ్యాపారులంతా అక్కడ వ్యాపారాలు చేయడంతో మార్కెట్ యార్డు కళకళలాడేది. కరోనా పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టడంలో మళ్లీ యధావిధిగానే ఫుట్‌పాత్‌లపై చిరువ్యాపారాలు చేస్తున్నారు. దీనిపై సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకుని మార్కెట్ యార్డుకు చిరువ్యాపారులను తరలించాలి. తద్వారా పట్టణ మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కానుంది.

ఆక్రమణలు తొలగిస్తే పాదచారులకు మేలు



ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలి. రహదారులపైనే చిరు వ్యాపారాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ఇబ్బందిగా ఉంది. ఉదయం, సాయంత్రం సమయంలో ట్రాఫిక్ నిలిచిపోతోంది. నడిరోడ్డుపైనే నడుచుకుంటూ విద్యార్థులు స్కూళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పూర్తిస్థాయిలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించినట్లయితే పాదచారులకు మేలు జరుగుతుంది.

– వాసుపల్లి తాతయ్యలు, అనకాపల్లి

మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు



పట్టణ మెయిన్‌రోడ్డులో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చిరువ్యాపారులు ఇష్టం వచ్చినట్లుగా వ్యాపారాలు సాగిస్తున్నారు. వాహనదారులు రోడ్లపై వాహనాలు నిలిపి కొనుగోలు చేస్తున్నారు. దాంతో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కరోనా సమయంలో చిరువ్యాపారులు రింగ్‌రోడ్డు ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో వ్యాపారం చేసుకున్నారు. ప్రస్తుతం అక్కడ వ్యాపారాలు చేసుకునేలా పాలకులు చర్యలు తీసుకోవాలి. దీనిపై అధికారులు దృష్టి సారించాలి. రహదారి ప్రమాదాలు తగ్గుతాయి.

– కాండ్రేగుల రాము, అనకాపల్లి

ఘనంగా అడవిరాజు బాబు పండుగ



అడవి రాజుబాబును దర్శించుకుంటున్న ఎంపీటీసీ సభ్యురాలు భవాని

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట గ్రామంలో అడవి రాజుబాబు పండుగ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అక్కడ వెలసిన అడవి రాజుబాబును భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్య నిర్వహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు, రేపు తాగునీరు నిలుపుదల

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల హెడ్ వాటర్ పంపుసెట్ మరమ్మతులు నిమిత్తం ఈ నెల 7, 8 తేదీల్లో అనకాపల్లి జోన్ పరిధిలో తాగునీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విశాఖ జీవీఎంసీ నీటి సరఫరా సాంకేతిక విభాగం అధికారి ఈఈ ఎస్.శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చోడవరం మండలం గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఉపయోగించిన నీటిని శుద్ధి చేయకుండా నేరుగా శారదా నదిలోనికి విడుదల చేయడం వల్ల తుమ్మపాల హెడ్ వాటర్ పంపుసెట్ మరమ్మతులకు గురైందన్నారు. ఈ పంపసెట్ ద్వారా అనకాపల్లి పట్టణానికి ప్రధానంగా ఆరు పైప్‌ల నుంచి నీటిని నిలుపుదల చేస్తున్నామని, జోనల్ పరిధిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయంగా వాటర్‌ట్యాంక్‌ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు

వి.ఎస్.ఇ.జెడ్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ కె.రోషిణి అపరంజి



డైట్ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రోషిణి అపరంజి

అనకాపల్లి టౌన్: కష్టపడి చదవడం కంటే ఇష్టపడి చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని వి.ఎస్.ఇ.జెడ్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ కె.రోషిణి అపరంజి (ఐఏఎస్) తెలిపారు. స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాల 18 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వైబ్రంట్ డైట్ పేరుతో వేడుకలు నిర్వహించారు. ముందుగా ముఖ్య అతిథి కె.రోషిణి అపరంజి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి హార్డ్‌వర్క్ చేయాలని అప్పుడే రాణిస్తారన్నారు. తాను కూడా సామాన్య కుటుంబం నుంచి వచ్చి కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నానంటూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. గౌరవ అతిథి రామ్ మాట్లాడుతూ విద్యార్థులు తలచుకుంటే ఏదైనా సాధించవచ్చన్నారు. డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సాంకేతిక రంగాల్లో గొప్ప ఆవిష్కరణలకు డైట్ కళాశాలకు 4వ స్టార్ ర్యాకింగ్ సాధించిందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సాధించిన విజయాలను వార్షిక నివేదిక ద్వారా వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే మహిళలపై లైంగిక దాడులు

అనకాపల్లి టౌన్: కూటమి ప్రభుత్వం వైఫల్యం వల్లే రాష్ట్రంలో మహిళలపై లైంగిక దాడులు తరచూ జరుగుతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. రమణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుచ్చెయపేట మండలం వడ్డాదిలో ఒక ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థినిపై అదే పాఠశాల ఉపాధ్యాయుడు లైంగిక దాడి చేయడం దారుణమన్నారు. హోం మంత్రి అనిత సొంత జిల్లాలో ఇటువంటి సంఘటనలు జరగడం సిగ్గుచేటన్నారు. వీటిపై కఠిన చర్యలు లేకపోవడంతో ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన ఇటువంటి సంఘటనలపై తీసుకున్న చర్యలను ప్రజలకు తెలియజేయాలన్నారు. నిర్భయ, దిశ చట్టాలు అమలు చేయడంలో వైపల్యం చెందిదని, తక్షణమే పోలీస్ యంత్రాగం నష్ట నివారణ చర్యలు చేపట్టాలన్నారు. లైంగిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోడమే కాకుండా సంబంధిత పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

ఆర్చరీలో ప్రతిభ చాటిన గణేష్‌కు అభినందన



కాంస్య పతకం సాధించిన గణేష్ మణిరత్నం

పరవాడ: ఉత్తరాఖండ్‌లో ఇటీవల జరిగిన 38వ జాతీయ క్రీడల్లో అద్భుతవిజయం సాధించిన విశాఖ జిల్లా ఆర్చర్ తిరుమూరు గణేష్ మణిరత్నంను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మణిరత్నం కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత ఆర్చరీ ఈవెంట్‌లో కాంస్య పతకం, కానో స్లాలోమ్ ఉమెన్స్ (కె-1) మిక్స్‌డ్ కాంపౌండ్ ఈవెంట్‌లో రజత పతకం కై వశం చేసుకున్న సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి నిశాంత్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారి భాస్కర్, పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, వైజాగ్ ప్రొఫైల్స్ అధినేత వి.కృష్ణారావు, వి.కృష్ణమూర్తి తదితరులు అభినందించారు.

బెండ ధర పైపైకి..

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం బెండకాయ ధర బెంబేలెత్తించింది. కిలో రూ.వందకు అమ్మకాలు సాగాయి. ఉత్పత్తి తగ్గడంతో ధర పెరిగిందని వ్యాపారులు తెలిపారు. వంకాయ, టమాటా ధరలు మాత్రం తగ్గాయి. గత వారం కిలో రూ.20 ఉన్న టమాటా ఈ వారం రూ.15కు తగ్గింది. రూ.80 అమ్మిన వంకాయ ఒక్కసారిగా రూ.30కి తగ్గిపోయింది. ఉల్లి, బంగాళదుంప రూ.40, బీట్‌రూట్, బరబాటి, బీన్స్ రూ.50, క్యారెట్, చిక్కుడు, చామదుంప రూ.60, కాకరకాయ రూ.80కి విక్రయాలు సాగాయి. గోబీపువ్వు ఒకటి రూ.20కి విక్రయించారు.

బోయిలకింతాడలో కిరాణా షాపు దగ్ధం

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడలో బుగత రమణమ్మకు చెందిన పాన్‌షాపు గురువారం దగ్ధమైంది. షాపులో ఉన్న సామగ్రి కాలి బూడిదైంది. దీంతో సుమారు రూ.50 వేలు ఆస్తి నష్టం జరిగింది. గత 15 ఏళ్ల నుంచి ఈ షాపు నిర్వహిస్తూ ఆమె జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రమాదంతో బాధిత కుటుంబం జీవనాధారం కోల్పోయింది. షార్టు సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని బాధితులు చెప్పారు.

ఇద్దరు వ్యక్తుల అదృశ్యంపై ఫిర్యాదు



పవన్‌కుమార్



శ్రీను

పెందుర్తి: చినముషిడివాడ వుడా కాలనీకి చెందిన పవన్‌కుమార్‌శర్మ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు అతడి భార్య నీరజాశర్మ పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత నెల 10న ఇంటి నుంచి బయటికి వెళ్లిన పవన్‌కుమార్‌శర్మ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో నీరజ పోలీసులను ఆశ్రయించింది.

- పెందుర్తి సావిత్రినగర్‌కు చెందిన ఉప్పలపాటి శ్రీను గత డిసెంబర్ 14న ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. ఎంతకీ అతడు తిరిగి రాకపోవడంతో అతని కుమారుడు ఉప్పలపాటి వర్మ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసులు దర్యాప్తు జరుగుతున్నాయి.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన



శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో నగరేశ్వరస్వామి వారికి లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతిష్ట శతజయంతి ముగింపు ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం ప్రధాన అర్చకులు రాజేటి శ్రీరామాచార్యులు, రేజేటి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో విఘ్నేశ్వరపూజ, పంచగవ్యప్రాసన, నగరేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వనామార్చనలు, నీరాజ మంత్రపుష్పం, సాయంత్రం 4 గంటలకు 108 మంది దంపతులతో సుహాసినీల పూజ వంటి అనేక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రతిష్ట శతజయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు మాట్లాడుతూ నాలుగో రోజైన శుక్రవారం అమ్మవారి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం 4 గంటలకు లక్ష కుంకుమార్చనలు, చండీహోమం, ఏకోత్తర సహస్ర(1001) కలశ మండపారాధన వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రతిష్ట శతజయంతి ఉత్సవ కో చైర్మన్ డాక్టర్ గ్రంథి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు లక్ష బిల్వార్చన

కశింకోట: స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం(శివాలయం)లో ఈ నెల 8న భీష్మ ఏకాదశి పురస్కరించుకొని లక్ష బిల్వార్చన నిర్వహించనున్నట్లు అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు స్వామివారి ఆలయంలో గణపతి పూజ, ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఆ తర్వాత లక్ష బిల్వ పత్రార్చన, లక్ష కుంకుమార్చన, సాయంత్రం జ్యోతిర్లింగార్చన, ప్రసాద వితరణ జరుగుతాయన్నారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

నేడు గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలు వద్ద ఆలయంలో వెలసిన గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) సారె ఊరేగింపు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. గౌరమ్మ ఉత్సవంలో భాగంగా ఏటా ముందు రోజు సారె ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి బ్యాండ్ మేళాతో ఊరేగింపు ప్రారంభమై గ్రామ ప్రధాన వీధుల మీదుగా సాగుతుందన్నారు. వివిధ రకాల పిండి వంటలు, పండ్లు వగైరా పళ్లాల్లో మహిళలతో ఊరేగింపు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కోలాటాల ప్రదర్శనతోపాటు బాణసంచా కాలుస్తామన్నారు.

బైక్ ఢీకొని ఆలయ అర్చకుడికి తీవ్ర గాయాలు

మాడుగుల రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొని ఎం.కోడూరు శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ ప్రధానార్చకుడు పెద్దింటి రాంబాబుకు గురువారం తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాడుగులలో రాంబాబు నడిచి వెళ్తుండగా ఓ యువకుడు వెనక నుంచి బైక్‌తో బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాంబాబును స్థానికులు ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుడు సంతోషకుమార్ ప్రథమ చికిత్స చేశారు. రాంబాబు తల వెనక భాగంలో మూడు కుట్లు, కాలికి నాలుగు కుట్లు వేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు బైక్‌ను స్వాధీనం చేసుకుని, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా అప్పన్న కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న భక్తులు

సింహాచలం: ఒడిశాలోని చికిడి గ్రామంలో గురువారం ఉదయం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సింహాచలం దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఒడిశాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా చికిడి గ్రామంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రచార రథంలో ఉత్సవమూర్తులకు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఒడిశా భక్తులు కనులారా ఈ వైభవాన్ని వీక్షించారు. గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. కాగా ఒడిశాలోని ఈనెల 2 నుంచి ప్రారంభమైన దేవస్థానం ప్రచార రథం పర్యటన గురువారంతో పూర్తయింది. దీంతో సింహాచలం దేవస్థానానికి రథం తిరుగు పయనమైంది.

రెండో రోజు కొనసాగిన నిరసన



నిరసన చేపట్టిన సర్పంచ్‌లతో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

మాకవరపాలెం: ప్రమాదాలతో పాటు రోడ్లు అధ్వానంగా మారుతున్నాయంటూ బాక్సైట్ లారీలను అడ్డగించి చేపట్టిన నిరసన కొనసాగుతోంది. మండలంలోని శెట్టిపాలెం, భీమబోయినపాలెం, జడ్.గంగవరం సర్పంచ్‌లు అల్లు నామునాయుడు, రుత్తల నందకిషోర్, దుంగల రమణ ఆధ్వర్యంలో బుధవారం బాక్సైట్ ఖనిజాన్ని తరలించే లారీలను అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా భీమబోయినపాలెం వద్ద వారంతా గురువారం కూడా తమ నిరసన కొనసాగించారు. ఈ నేపథ్యంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సర్పంచ్‌లతో చర్చలు జరిపారు. లారీల విడిచిపెట్టాలని కోరారు. దీంతో ఖనిజంతో ఉన్న లారీలను రిఫైనరీకి వెళ్లనిచ్చేదిలేదని, కావాలంటే వెనక్కి తీసుకుపోవాలని వారికి స్పష్టం చేశారు. ఖాళీ లారీలను విడిచిపెట్టడంతో అసోసియేషన్ ప్రతినిధులు వెనుదిగారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మాకవరపాలెం: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని పి.పి.అగ్రహారం గ్రామానికి చెందిన పి.రమణ(45) గురువారం బి.ఎస్.పేట వద్ద బైక్‌పై వెళుతూ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా మాకవరపాలెంతో పాటు చుట్టు పక్కల మండలాల వాహనాలు అందుబాటులో లేవు. చివరికి ప్రైవేటు వాహనంలో మొదట స్థానిక పీహెచ్‌సీకి, అనంతరం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సబ్బవరం: మండల కేంద్రంలోని సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ పిన్నింటి రమణ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు అధికారులమని చెప్పి లోన్ మంజూరు చేస్తామని, రుణ మాఫీ వస్తుందని, కేవైసీ అప్‌డేట్ చేయాలని తెలియని లింకులు పంపిస్తే ఓపెన్ చేయవద్దని తెలిపారు. మన తప్పిదాల వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా విభూతి బ్రదర్స్ వారిచే కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఎస్‌బీఐ మేనేజర్ దాసరి రాజశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ చంద్రశేఖర్, అఖిల్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.